సాక్షి నల్లగొండ
సోమవారం। 18 । మార్చి। 2024



బొమ్మగీస్తే అచ్చుగుద్దినట్లే !
రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన శ్వేత చిత్రలేఖనంలో పలువురి ప్రశంసలు అందుకుంటోంది. - 10లో



కాంగ్రెస్ గెలుపు అవసరం
పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఎంతో అవసరమని డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. - 10లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-32 (సోమవారం సా॥)
సహర్ 5-00 (మంగళవారం ఉ॥)

న్యూస్‌రీల్

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

నల్లగొండ : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్నాయి. జిల్లాలో మొత్తం 109 పరీక్ష కేంద్రాల్లో 19,715 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు మెడికల్ కిట్, మంచినీటి సౌకర్యం కల్పించారు. పరీక్ష కేంద్రాల్లో హాల్ టికెట్ నెంబర్లు వేశారు. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశానికి ఐదు నిమిషాల సడలింపు ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి ఉన్నా నివృత్తి చేయసుకోవాలని సూచించారు. భయాందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించాలని డీఈఓ భిక్షపతి కోరారు.

మీడియాలో ప్రకటనలు నిలిపివేయాలి

నల్లగొండ : టెలివిజన్ ఛానళ్లు, వార్తా పత్రికల్లో ప్రభుత్వ పథకాలపై ప్రకటనలు నిలిపివేయాలని కలెక్టర్ హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున అన్ని టెలివిజన్ ఛానళ్లు, వార్త పత్రికలలో ప్రభుత్వ పథకాలపై ప్రకటనలు ప్రసారం చేయడం, ప్రచురించడం నేరమన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి

ప్రచార కరపత్రాలు, పోస్టర్ల ప్రచురణలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రజాప్రతినిధ్య చట్టం-1951 నిబంధనలు పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టర్లు, కరపత్రాలపై పబ్లిషర్, ప్రింటర్ పేరు, ఫోన్ నంబర్‌తో సహా ప్రచురించాలని, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రచురణకర్త ద్వారా ఒక డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు. ముద్రించిన పోస్టర్లు, కరపత్రాల వివరాలను ప్రచురించిన మూడు రోజుల్లో జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలని పేర్కొన్నారు. పేర్కొన్న ప్రతులకు మించి ఎక్కువ కాపీలు ముద్రించడం, పంపిణీ చేయడం వంటివి చేస్తే ప్రజా ప్రతినిధ్య చట్టం-1951, సెక్షన్ 127 కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

22న హాలియా మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

హాలియా : హాలియా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ఈనెల 22న నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ అయినట్లు మున్సిపల్ కమిషనర్ మున్వర్‌అలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న సాయంత్రం 4 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సభ్యులందరికీ సమావేశ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



యాద్గార్‌పల్లిలో ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ : వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆదివారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలకు సాగునీరు అందక పొట్ట దశలో ఎండిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే స్పందించి ఎండిపోయిన పంటల వివరాలను సేకరించి రైతులకు ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, రైతులు పాల్గొన్నారు.



వైభవంగా శ్రీలక్ష్మీనరసింహుల ఎదుర్కోలు మహోత్సవం



యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి, అమ్మవారిని పెళ్లి కొడుకు, పెళ్లి కూతురుగా ముస్తాబు చేసి ఎదుర్కోలు మండపానికి ఊరేగింపుగా తోడ్కొని వస్తున్న ఆచార్యులు, ఆలయ సిబ్బంది, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఈఓ భాస్కర్‌రావు, నరసింహమూర్తి తదితరులు



ఉదయం జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన నారసింహుడు

మారని మిల్లర్ల తీరు..

ధాన్యంలో తాలు, పచ్చగింజ పేరిట కొర్రీలు
- ధర తగ్గించి కొనుగోలు
- పెట్టుబడులు కూడా రావని అన్నదాతల ఆందోళన
- రాస్తారోకో చేపట్టిన రైతులు
- ధర తగ్గకుండా చూడాలని వేడుకోలు



శెట్టిపాలెం గ్రామ శివారులోని మిల్లుల వద్ద బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు

మిర్యాలగూడ : ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకుందామంటే మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాల ఆధారంగా సాగు చేసి పండించిన పంట చేతికొచ్చాక రకరకాల కొర్రీలు పెట్టి మిల్లర్లు ధర తగ్గిస్తున్నారు. మరోవైపు ధాన్యం వెంటనే దిగుమతి చేసుకోకుండా సాయంత్ర వరకు వేచి ఉండేలా చూసి ధరను అమాంతం తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ధర ఇలాగే ఉంటే పెట్టుబడులు కూడా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. బియ్యం క్వింటా రూ.6500కు పైగా అమ్ముకుంటూ ధాన్యాన్ని మాత్రం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ధాన్యం ధర తగ్గకుండా చూడాలని కోరుతున్నారు.

బోర్లు, బావుల కిందే సాగు..

సాగర్ ఎడమకాల్వకు ఈ ఏడాది నీరు లేకపోవడంతో బావులు, బోర్ల కింద రైతులు వరి సాగు చేశారు. ప్రధానంగా చింట్లు, హెచ్‌ఎంటీ రకాలు పండించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గడం, తరచూ విద్యుత్ మోటార్లు కాలిపోవడం, పంటలు ఎండిపోకుండా అదనంగా బోర్లు వేస్తూ రైతులు ఈ సారి పంట పండించేందుకు అష్టకష్టాలు పడ్డారు. దీంతోపాటు పెట్టుబడి కూడా రెట్టింపు వ్యయం అయ్యింది. యాసంగి కోతలు ప్రారంభించిన సమయంలో మొదట క్వింటాకు రూ.2600 నుంచి రూ.2700 వరకు ధర చెల్లించి వడ్లు కొనుగోలు చేశారు. ధర కాస్త మెరుగ్గానే ఉందని భావించిన రైతులు మూడు నాలుగు రోజులుగా పొలాలు కోసి పెద్ద ఎత్తున ధాన్యాన్ని మిల్లుల తరలిస్తున్నారు. ధాన్యం రాక పెరగడంతో ఇదే అదనుగా భావించిన మిల్లర్లు ధాన్యం ధర తగ్గించారు. ధాన్యంలో తాలు, పచ్చగింజ ఎక్కువగా ఉందని కొర్రీలు పెడతూ.. ఇప్పుడు క్వింటాకు రూ.2300 నుంచి రూ.2400 వరకు చెల్లిస్తున్నారు. కొన్ని మిల్లుల వద్ద ట్రాక్టర్లతో తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకుండా సాయంత్రం వరకు వేచి ఉండేలా చేసి సాయంత్రానికి క్వింటాకు రూ.2100 వరకు మాత్రమే ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు చేసేదేమీ లేక.. మరొక రోజు వేచి ఉండాలంటే ట్రాక్టర్ కిరాయి భారం పడుతుందనే బాధతో రైతులు మిల్లర్ చెప్పిన ధరే ధాన్యం ఇచ్చి వెళ్తున్నారు.

యాద్గార్‌పల్లి క్రాస్‌రోడ్డులో రైతుల రాస్తారోకో

ధాన్యం ధర తగ్గించడం, కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు ఆదివారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి క్రాస్‌రోడ్డు వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా పండించిన కొద్దోగొప్పో పంటను అమ్ముకుందామని మిల్లుల వద్దకు ధాన్యాన్ని తీసుకొస్తే మిల్లర్లు కొనుగోలు చేయడం లేదన్నారు. కోతలు ప్రారంభమైన సమయంలో క్వింటా ధాన్యానికి రూ.2700 వరకు ఇచ్చిన మిల్లర్లు.. కోతలు ఊపందుకోగానే కేవలం రూ.2300కే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో పెట్టుబడులు నష్టపోతామని వాపోయారు.

రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం
- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై రైస్ మిల్లులను సందర్శించి రైతుల బాధలను తెలుసుకొని మిల్లర్లతో మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో కొద్ది రోజులుగా ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్ల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకొని మద్దతు ధర అందించాలన్నారు. ఆయన వెంట నూకల వేణుగోపాల్‌రెడ్డి, బెజ్జం సాయి తదితరులు ఉన్నారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దిగుబడి తగ్గింది



వానాకాలంలో 8 ఎకరాలు సాగు చేయగా ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చింది. నీటి ఎద్దడి రావడంతో బోర్ల కింద నాలుగు ఎకరాల్లోనే సాగు చేశా. ఎకరాకు 25 బస్తాలే దిగుబడి వచ్చింది. ధాన్యం మిల్లుకు తీసుకుపోతే క్వింటాకు రూ.2300 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో ఆర్థికంగా నష్టపోయా.
– నల్లమెట్ల దుర్గయ్య, రైతు, పచ్చారిగడ్డ

రూ.2.50లక్షలు పెట్టుబడులు పెట్టా



ఐదెకరాల్లో వరిసాగు చేపట్టా. పెట్టుబడుల నిమిత్తం ఐదెకరాల్లో రూ.2.50 లక్షలు ఖర్చు చేశా. బోరు నీటితో సాగు చేసిన ఐదెకరాల్లో మూడెకరాలు నీరందక ఎండిపోగా.. రెండెకరాల్లో పంట చేతికొచ్చింది. ఎకరాకు 30 బస్తాల దిగుబడే వచ్చింది. తీరా అమ్ముకుందామని మిల్లుకు వెళ్తే క్వింటాకు రూ.2300 ధర చెల్లించారు. పెట్టిన పెట్టుబడి సైతం రాక.. ఆర్థికంగా దెబ్బతిన్నా.
– అంగోతు రవికుమార్, రైతు, ఉల్సాయిపాలెం

భువనగిరికి భిక్షమయ్య?

కొలిక్కి వచ్చిన ఎంపీ అభ్యర్థిత్వం
- జీసీ కోటాలో దక్కనున్న అవకాశం
- ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్న బీఆర్‌ఎస్ అధిష్టానం



సాక్షి, యాదాద్రి : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న భువనగిరి, నల్లగొండ స్థానాలను బీసీ, ఓసీలకు కేటాయించాలని బీఆర్‌ఎస్ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. అందులో భాగంగా గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో గౌడ సామాజిక వర్గం ఓట్లు ఉన్నందున భువనగిరి సీటును అదే సామాజిక వర్గానికి చెందిన భిక్షమయ్యగౌడ్‌కు కేటాయించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

భిక్షమయ్య వైపు మొగ్గు

భువనగిరికి అభ్యర్థి ఎంపికలో బీఆర్‌ఎస్ అధిష్టానం తీవ్ర కసరత్తు చేసింది. సామాజికవర్గాల వారీగా పలువురు నేతల పేర్లను పరిశీలించింది. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్‌రెడ్డి, జనగాం మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నకిరేకల్‌కు చెందిన డాక్టర్ చెరుకు సుధాకర్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ పేర్లు పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. అయితే పైళ్ల శేఖర్‌రెడ్డి పోటీ చేయడానికి ఆసక్తి చూపలేదని తెలిసింది. అలాగే డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అధిష్టానం ఆదేశిస్తే పోటీలో ఉంటానని ప్రకటించారు. వీరితో పాటు తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి పేరు కూడా పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తోంది.

సామాజికవర్గ సమీకరణలే ప్రధానం

భువనగిరి, నల్లగొండ ఎంపీ టికెట్ల కేటాయింపులో సామాజికవర్గాలను బీఆర్‌ఎస్ పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. భువనగిరి బీసీలకు, నల్లగొండ ఓసీలకు ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఒక వేళ నల్లగొండ సీటు బీసీలకు కేటాయించవలసి వస్తే యాదవులకు, భువనగిరి బీసీలకు ఇస్తే గౌడ సామాజిక వర్గానికి ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది. అయితే గతంలో నల్లగొండ పార్లమెంట్ స్థానం పరిధిలో ఒక రాజ్యసభ, రెండు చోట్ల ఎమ్మెల్యేలుగా యాదవ సామాజిక వర్గానికి అవకాశం ఇచ్చారు. వీరితో పాటు యాదవులకు కార్పొరేషన్ పదవులకు కూడా దక్కాయి. దీంతో ఈసారి నల్లగొండ స్థానాన్ని రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చి, భువనగిరిని బీసీ(గౌడ)లకు ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీలు

నల్లగొండ టూటౌన్ : క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయడానికే ప్రతి ఆదివారం ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొమ్మపాల గిరిబాబు పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో కేంద్రియ విద్యాలయం ఫుట్‌బాల్ టీం, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల అకాడమీ జట్ల మధ్య లీగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్ క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచ్ లింగయ్య నాయక్, కత్తుల హరి, జూకటి బాలరాజు, లింగయ్య, మురళి, యావర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ తీరంలో వేరుశనగ సాగు..



కృష్ణాతీరంలోని నంబాపురంలో సాగుచేసిన వేరుశనగ

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయ తీరం వెంట ఉన్న గ్రామాల రైతులు వేరుశనగ సాగుచేపట్టారు. ఈ ఏడాది వర్షాభావంతో జలాశయంలో నీటిమట్టం 514 అడుగులకు పడిపోయంది. దీంతో తీరం వెంట ఉన్న పెద్దవూర, పీఏపల్లి, చందంపేట మండలాల పరిధిలోని తండాలు, గ్రామాల రైతులు జలాశయ భూముల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు. వరదలు వచ్చిన సమయంలో కృష్ణాతీరంలో ఒండ్రు మట్టి మేట వేస్తుంది. జలాశయంలో నీరు తగ్గితే ఆ భూమి సారవంతంగా మారుతుంది. అందులో పంట కూడా బాగా పండుతుంది. దీంతో రైతులు జలాశయంలో మోటార్లు వేసుకుని.. పైపులైన్ల ద్వారా నీటిని తరలిస్తూ స్ప్రింక్లర్ల సాయంతో చేలకు నీరందిస్తున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే పంట చేతికొచ్చింది. కూలీలకు కూడా పని దొరుకుతోంది. ప్రస్తుతం పంటలతో తీరం అంతా కళకళలాడుతోంది. గతంలో మే, జూన్, జులై మాసాల్లో ఇక్కడి ఆ భూముల్లో సజ్జ, కూరగాయలు సాగు చేసేవారు. ఈ సారి వేరుశనగ సాగు చేసి మంచి దిగుబడి పొందుతున్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం

- కలెక్టర్ హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన, పక్కన ఎస్పీ చందనాదీప్తి తదితరులు

నల్లగొండ : నల్లగొండ లోక్‌సభ స్థానానికి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ చందనాదీప్తితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న పార్లమెంట్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని, 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలు, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. నల్లగొండ జిల్లా పరిధిలో మొత్తం 1813 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 247 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని.. వాటిల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. హోం ఓటింగ్ కోసం ఫాం 12 -డి అందుబాటులో ఉంచామన్నారు. 85 సంవత్సరాలు నిండిన వారికి హోం ఓటింగ్ సౌకర్యం ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది, ఈవీఎంలు, వీవీ ప్యాట్లు సిద్ధం చేశామన్నారు.

ఎన్నికల ఖర్చులు నమోదు చేస్తున్నాం..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున శనివారం నుంచే ఎన్నికల ఖర్చులు రికార్డు చేస్తున్నామన్నారు. అభ్యర్థులు ఖరారు కానందున ప్రస్తుత ఖర్చును రాజకీయ పార్టీల కింద జమ చేస్తామన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సువిధ యాప్ ద్వారా అనుమతి పొందాలని సూచించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని టోల్‌ఫ్రీ నంబర్లతో పాటు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీని నియమించామన్నారు. జిల్లా సరిహద్దులైన వాడపల్లి, నాగార్జునసాగర్, అడవిదేవులపల్లి, టెల్‌పాండ్ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పరిధిలో కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎన్నికలకు గట్టి బందోబస్తు : ఎస్పీ


పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే తనిఖీలు ప్రారంభించామని.. గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా, ఎలాంటి కానుకలు తీసుకెళ్లకుండా నిఘా ఏర్పాటు ఉంచామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేలకు మించి డబ్బులు తీసుకెళ్తే అన్ని ఆధారాలు చూపించాలన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షించేలా సీసీ కెమెరాల సంఖ్య పెంచుతున్నామన్నారు.

ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

పార్లమెంటు ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన కోరారు. ఆదివారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వ ఆవరణలు, స్థలాలను అధికారిక కార్యాలయాలను ఎన్నికల ప్రచారం కోసం వాడొద్దని పేర్కొన్నారు. ఎన్నికల ఫిర్యాదులను సి-విజిల్‌తోపాటు, 1950 కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి చెప్పవచ్చని తెలిపారు. ఎస్పీ చందనాదీప్తి మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకుని ఎన్నికల ప్రచారం చేయకూడదని నామినేషన్ల సందర్భంగా మూడు వాహనాలకు మించి వినియోగించవద్దని పేర్కొన్నారు. ర్యాలీలో పది వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. సమావేశంలో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌డీఓ రాజ్యలక్ష్మి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

నల్లగొండ రూరల్ : బత్తాయి తోటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ సంగీతలక్ష్మి సూచించారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన బత్తాయి రైతుల రాష్ట్రస్థాయి సదస్సులో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువులను ఉపయోగించడం వల్ల భూసారంతోపాటు దిగుబడి, నాణ్యత తగ్గుతుందన్నారు. పండ్ల తోటల్లో అంతర్‌పంటగా జీలుగ, జనుము, వేరుశెనగ సాగు చేయడం వల్ల భూసారం నిలకడగా ఉండి నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. డ్రిప్ పద్ధతి ద్వారా తోటలకు నీరందించాలని సూచించారు. జిల్లాలో బత్తాయి సాగుకు భూములు అనుకూలంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు రాజాగౌడ్, సురేష్‌రెడ్డి తెలిపారు. నాటేటప్పుడే నాణ్యతగల మొక్కలను ఎంపిక చేయాలన్నారు. మల్లేపల్లి పరిశోధన కేంద్రంలో ప్రభుత్వం నాణ్యమైన మొక్కలు అందించాలని, సబ్సిడీపైన పనిముట్లు, ఫాంపాండ్లు, డ్రిప్, మల్చింగ్ షీట్‌లు, వేప పిట్, ఎరువులను అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు అనంతరెడ్డి, విద్యాసాగర్, శ్యాంసుందర్‌రెడ్డి, రైతులు అంజిరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌రావు, రాజు, సంధ్యారాణి, శ్వేత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగీతలక్ష్మి

క్లుప్తంగా

పాన్‌షాప్‌లో చోరీ

రామన్నపేట : గుర్తు తెలియని వ్యక్తులు పాన్ షాప్‌లో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన శనివారం రాత్రి రామన్నపేట మండల కేంద్రంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సోదరులు తాటిపాముల సాయి, శ్రవణ్‌కుమార్ చిట్యాల రోడ్డులో పాన్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 11 గంటలకు సాయి షాపును మూసి ఇంటికి వెళ్లాడు. ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తెరచి చూడగా సిగరెట్ డబ్బాలు, పాన్ తయారీకి ఉపయోగించే సామగ్రి కనిపించలేదు. వాటి విలువ సుమారు రూ.పదివేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ మేరకు బాధితుడు సాయి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భువనగిరిలో సైకో వీరంగం

- ఇద్దరు విద్యార్థులపై బ్లేడ్‌తో దాడి


విద్యార్థులపై దాడి చేసిన మునీర్

భువనగిరి క్రైం : గంజాయి మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. ఇద్దరు విద్యార్థులపై బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచాడు. భువనగిరి పట్టణంలోని హౌసింగ్ బోర్డులో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మునీర్ గంజాయి మత్తులో రోడ్డు వెంట వెళ్తున్న సింగన్నగూడేనికి చెందిన ఇద్దరు విద్యార్థుల గొంతులపై బ్లేడ్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించి మునీర్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.

జగద్రక్షకుడిగా.. జగన్మోహినిగా..


జగన్మోహిని అలంకార సేవను ఆలయ వీధిలో ఊరేగిస్తున్న ఆచార్యులు


స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహిస్తున్న ఆచార్యులు

- భక్తులకు దర్శనమిచ్చిన నృసింహుడు
- వైభవంగా స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఏడవ రోజుకు చేరాయి. కల్యాణోత్సవానికి ముందస్తుగా పెళ్లి చూపుల పర్వం జరుపుకున్న స్వామి వారు జగన్మోహిని రూపం దాల్చాడు. రాత్రి అశ్వవాహనంపై నారసింహుడు ఎదుర్కోలు మహోత్సవం జరుపుకున్నారు.

వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం

యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన ఎదుర్కోలు ఉత్సవం సూర్యుడు అస్తమించిన వేళ అప్పుడప్పుడే చీకటి కమ్ముకున్న సమయంలో వేద మంత్రోచ్ఛరణలతో జరిగింది. శ్రీలక్ష్మీ దేవితో నారసింహుని కల్యాణోత్సవంలో భాగంగా పెళ్లి చూపుల తతంగాన్ని నిర్వహించారు. రాత్రి 8.45 గంటలకు అశ్వవాహనంపై స్వామిని, ముత్యాల పల్లకిపై అమ్మవారిని అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పు రాజగోపురం ముందు గల మాఢ వీధిలో అశ్వవాహనంపై ఊరేగిన స్వామి వారిని పశ్చిమ ముఖంగా కూర్చోబెట్టి, ముత్యాల పల్లకిపై ఊరేగింపుగా వచ్చిన అమ్మవారిని తూర్పు ముఖంగా అధిష్ఠించారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకులు, ఇతర అధికారులు శ్రీస్వామి అమ్మవార్లకు ఇరు పక్షాలుగా వీడిపోయి పెద్దలుగా వ్యవహరించి గుణగణములను ఆచార్యులు చర్చించుకున్నారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల తిరు కల్యాణ వేడుకకు ముహూర్తం నిర్ణయించారు.

జగద్రక్షకుడిగా..

నిత్య పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీనరసింహుడు ఉదయం సుర, అసురులను సమ్మోహన పరిచే జగన్మోహినిగా అవతరించాడు. అలంకార సంబురాల్లో భాగంగా ఉదయం 9.30గంటలకు జగన్మోహిని రూపంలో స్వామి వారిని అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఆచార్యులు ఊరేగించారు. కల్యాణ ఘడియలు సమీపిస్తున్న తరుణంలో భయాన్ని గోల్పే నరసింహుడిని కనులు చెదిరే అలంకరణ చేసి, భక్త జనుల దర్శనం కోసం ఊరేగించారు. వేడుకల్లో అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అధికారులు, ఆచార్యులు, రుత్వికులు, పారాయణికులు పాల్గొన్నారు.


అశ్వవాహనంపై స్వామివారు

ఆలయంలో నేడు..

యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9గంటలకు శ్రీరామ అలంకారంలో హనుమంత సేవ, రాత్రి 8.45గంటలకు నుంచి గజవాహన శేవ, స్వామి అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవం.

యాదాద్రీశుడి కల్యాణానికి అంతా సిద్ధం

- 6వేలకు పైగా భక్తులు కూర్చునే విధంగా ఏర్పాట్లు..


తీర్చిదిద్దిన కల్యాణ వేదిక

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణ మహోత్సవానికి అధికారులు, ఆచార్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఉత్తర మాఢ వీధిలో భారీ కల్యాణ వేదికను సిద్ధం చేశారు. ఆలయానికి అనుగుణంగా ఫైబర్ సెట్టింగ్‌ను పంచ తల రాజగోపురాల మాదిరిగా వేశారు. వేదికపై కల్యాణ మూర్తులు, ఆచార్యులు కూర్చునేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. వేదిక ముందు 6వేలకు పైగా భక్తులు కూర్చునేలా ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని భక్తులంతా తిలకించే విధంగా 7 ఎల్‌ఈడీ భారీ స్క్రీన్‌లను సిద్ధంగా పెట్టారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు ఏవరు తీసుకువస్తారనే అంశాన్ని ఇంకా అధికారులు స్పష్టత ఇవ్వలేదు. కల్యాణోత్సవం నేపథ్యంలో శ్రీస్వామి వారి ఆలయాన్ని, కల్యాన వేదికను పూల తోరణాలు, విద్యుత్ దీపాలు, అరటి, మామిడి తోరణాలతో తీర్చిదిద్దుతున్నారు. సాయంత్రం 4గంటల నుంచి కొండపైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు


ప్రదర్శన ఇస్తున్న కళాకారిణి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం ఉదయం మల్లాపురానికి చెందిన శ్రీరామ భక్త భజన మండలి, కర్వాన్‌కు చెందిన శ్రీ విశ్వాంజనేయ భక్త సమాజం, యాదగిరిగుట్టకు చెందిన శ్రీయాదాద్రి భక్త భజన సమాజం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. అనంతరం అమరవాది వేంకట నరసింహాచార్యులుచే శ్రీసుదర్శన నారసింహ హోమం, నృసింహ ఆవిర్భావంపై ఉపన్యాస కార్యక్రమం కొనసాగింది. చేబ్రోలు నారాయణ దాస్, భాగవతార్‌చే భీష్మ ప్రతిజ్ఞ హరికథ గానం చేపట్టారు. డాక్టర్ స్వర్ణ మంగళపల్లిచే కర్నాటక సంగీతం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక కూచిపూడి నృత్య కళాకారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన కొనసాగింది. సాయంత్రం కరీంనగర్‌కు చెందిన తిరుమలచే భక్తి సంగీతం, ది స్కల్ ఆఫ్ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే భరత నాట్యం, డాక్టర్ వనజ ఉదయ్‌చే కూచిపూడి నృత్య ప్రదర్శన, జొన్నలగడ్డ సత్య శ్రీరాంచే కర్ణాటక సంగీత కార్యక్రమాలు కొనసాగాయి.

ఉచిత వైద్య శిబిరం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుంది. హైదరాబాద్‌లోని కొత్తపేటలో ఉన్న శ్రీసాయి సంజీవిని ఆస్పత్రి వైద్యులు అంజయ్య, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కొండపైన ప్రధాన కార్యాలయం, కొండ కింద కొత్త బస్టాండ్, కల్యాణ కట్ట వద్ద వైద్య శిబిరాలు జరిగాయి. భక్తులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను అందజేశారు.

బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

యాదగిరిగుట్ట: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానిక ప్రయాణికులు, బాధితురాలి కుమారుడు రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం బొందుగులకు చెందిన బరుగు ఎల్లమ్మ రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ మండలం రాంపల్లిలో నివాసం ఉంటుంది. ఆదివారం సొంత గ్రామమైనా బొందుగులకు వచ్చింది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో సొంత గ్రామం నుంచి ఘట్కేసర్ మండలం రాంపల్లికి వెళ్లేందుకు యాదగిరిగుట్ట బస్టాండ్‌కు వచ్చింది. బస్టాండ్ లోకి వెళ్లే క్రమంలో ఆమెను బస్సు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను భువనగిరి ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

హుజూర్‌నగర్‌రూరల్: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. లింగగిరి గ్రామానికి చెందిన పంగ సైదులు (48) మత్స్యకారుడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు. కొంతకాలం క్రితం భార్య, చిన్నకుమారుడు మృతిచెందడంతో సైదులు అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో ఆదివారం గ్రామ శివారులోని మామిడి తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి పెద్దకుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

కారు ఢీకొని యువకుడు మృతి

చిట్యాల: పట్టణంలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. సూర్యాపేట మండలం సోలిపేట గ్రామానికి చెందిన తలారి రవి(28) హైదరాబాద్‌లో కూలి పనులను చేసేందుకు బైక్‌పై స్వగ్రామం నుంచి శనివారం రాత్రి బయలుదేరారు. మార్గమధ్యలో చిట్యాల పట్టణంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై గల రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో రాంగ్ రూట్‌లో నార్కట్‌పల్లి వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రవి అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య చామంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

1న నారాయణపురం ఎంపీపీ ఎన్నిక

సంస్థాన్ నారాయణపురం : సంస్థాన్‌నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమాదేవిపై తొమ్మిది మంది ఎంపీటీసీలు ప్రతిపాదించిన అవిశ్వాసంపై ఏప్రిల్ 1వ తేదీన ఓటింగ్ నిర్వహించనున్నారు. ఆ రోజు నిర్వహించే ప్రత్యేక సమావేశానికి హాజరుకావాలని ఎంపీటీసీలకు ఆర్డీఓ శేఖర్‌రెడ్డి ఆదివారం నోటీసులు జారీ చేశారు. ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఎంపీటీసీలు గత ఏడాది జూలై 28న కలెక్టర్‌కు సంతకాలతో కూడిన నోటీస్ అందజేశారు. ఎంపీపీ హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో అవిశ్వాసం నిలిచిపోయింది. ఇటీవల కోర్టు స్టే ఎత్తివేయడంతో ఏప్రిల్ 1న ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 13 మంది ఎంపీటీసీలకు గాను బీఆర్‌ఎస్ 9, కాంగ్రెస్ 1, సీపీఎం 2, సీపీఐకి ఒకరు సభ్యుడు ఉన్నారు. అందులో గుజ్జ గ్రామ ఎంపీటీసీ(సీపీఎం) మృతి చెందారు. ఎంపీపీ బీఆర్‌ఎస్ నుంచి గెలిచినప్పటికీ సొంతపార్టీ సభ్యులే అవిశ్వాసం పెట్టడంతో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన గుడిమల్కాపురం ఎంపీటీసీ బీఆర్‌ఎస్‌లో చేరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


కలశ పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి దంపతులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల గ్రామంలోని శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం 108 కలశాలతో స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. వేడుకల్లో జెడ్పీటీసీ దంపతులు కోట పుష్పలతామల్లారెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం సుదర్శన హవనం, హోమం, తిరువీధి ఉత్సవం(గరుడ సేవ) తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాక నర్సింహ, గట్టు పాండురంగారెడ్డి, రంగ మధు, భోగ చంద్రశేఖర్, రాజారమేశ్, గంగాపురం వెంకటేశం, నూకల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

అడ్డగూడూరు : గుర్తుతెలియని వ్యక్తులు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, ఆభరణాలను అపహరించారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తుప్పతి భిక్షం, తుప్పతి మల్లయ్య, దాసరి యాదయ్య ఇండ్లలో చోరీ జరిగింది. మరో ఇద్దరి ఇళ్లలో చోరీకి ప్రయత్నం చేశారు. తుప్పతి భిక్షం ఇంట్లో 45 తులాల వెండి, 2 తులాల బంగారం, రూ.6 వేలు, తుప్పతి మల్లయ్య ఇంట్లో రూ.70 వేలు, దాసరి యాదయ్య ఇంట్లో రూ.8 వేలు, 8 తులాల వెండి చోరీకి గురైనట్లుగా ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. క్లూస్ టీమ్‌తో పరిశీలన చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎంసీపీఐ(యూ) నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా మట్టయ్య

హుజూర్‌నగర్ : నల్లగొండ పార్లమెంటు స్థానానికి బీఎల్‌ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా వస్కుల మట్టయ్యను ప్రకటించినట్లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో తనను ప్రకటించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.తనను నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయం అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

సాక్షి, యాదాద్రి : రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే.జండగే కోరారు. ఆదివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం, మతం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే వ్యాఖ్యలు చేయొద్దని, ఓటర్లను ప్రలోభపెట్టవద్దని, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు నిషేధమన్నారు. సువిధ పోర్టల్ ద్వారా సభలు, సమావేశాలకు అనుమతులు ఇస్తామన్నారు. ఏదైనా సమస్య ఉన్నా, కోడ్ ఉల్లంఘించినా టోల్‌ఫ్రీ నంబర్ 1950, సి -విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ పార్టీల వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను తొలగిస్తున్నట్లు తెలిపారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, పేరు తప్పనిసరిగా పేర్కొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బట్టుపల్లి అనురాధ, బట్టు రామచంద్రయ్య, ఎండీ మజార్, కే.వెంకటేష్, బి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై వాహనాల రద్దీ


గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

బీబీనగర్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. సెలవు రోజు కావడం, యాదాద్రి బ్రహ్మోత్సవాలు, శుభకార్యాలు ఉండడంతో ప్రజానీకం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో బీబీనగర్ మండల పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులుదీరాయి.

అత్త మృతిని జీర్ణించుకోలేక కోడలు మృతి

- ఒకే రోజు ఇద్దరు హఠాన్మరణం
- యాదాద్రి జిల్లాలో విషాదం


చుక్కల భారతమ్మ (ఫైల్)


చుక్కల మంగమ్మ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్ : అత్త మృతిని జీర్ణించుకోలేక కోడలు కూడా గుండెపోటుతో కుప్పకూలి తనువు చాలించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం దాతారుపల్లి ఆవాసమైన గొల్లగుడిసె గ్రామానికి చెందిన చుక్కల భారతమ్మ (65) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తల్లిని చూసేందుకు శనివారం భువనగిరి మండలం రాయగిరిలోని పుట్టింటికి వెళ్లింది. ఆదివారం ఉదయం అకస్మాత్తుగా ఆమె గుండెపోటుతో మరణించింది. ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామమైన గొల్లగుడిసెకు తీసుకువచ్చారు. అత్త మృతదేహాన్ని చూసిన కోడలు చుక్కల మంగమ్మ (26) కన్నీరు మున్నీరైంది. పెద్ద పెట్టున రోదిస్తూనే మంగమ్మ కుప్పకూలి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. వెంటనే ఆమెను భువనగిరి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మంగమ్మ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోందని బంధువులు తెలిపారు. అత్తా కోడళ్లు ఒకే రోజు మృతిచెందడంతో గొల్లగుడిసె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగమ్మకు ఇద్దరు పిల్లలు ఉండగా, భర్త మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


పూజలు చేస్తున్న వేద పండితులు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

రాజాపేట : మండలంలోని రేణికుంట పరిధిలో నూతనంగా నిర్మించిన సంకల్పసిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పండితులు శ్రీమాన్ డాక్టర్ ఎం ముత్తుబట్టర్, దీవి శ్రీనివాస దీక్షితులు, బిక్కవోలు కేశవాచార్యులు, వీవీఆర్‌బీజీఆర్‌కే గౌతమ్ (కృష్ణ)ల బృందం సభ్యుల వేద మంత్రోచ్ఛరణలతో ఉదయం విశ్వక్సేనారాధన, పుణ్యావాచనం, పంచగవ్యోద్ధరణం, త్రిషవణ స్నపనలు, రత్నన్యాసం, యంత్ర దవ మూర్తి స్థాపనలు, మహాపూర్ణాహుతి, జీవకళావాహనం, దివ్యమంగళ విగ్రహదర్శనం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి శ్రీవారి ప్రధానార్చకులు శ్రీమాన్ అర్చకం వేణుగోపాల దీక్షితులు సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ, అనుబంధ విగ్రహాల యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు, పోలీస్, ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో కూర భద్రినాథ్, కుంబాల ఎల్లారెడ్డి, సూదిరెడ్డి నాగిరెడ్డి, వట్టం రాఘవేంద్ర, సమ్మెట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటిపూట

- నేటి నుంచి అమలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

భువనగిరిటౌన్ : ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం నుంచి ఒంటిపూట నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8నుంచి 11 గంటల వరకు కేంద్రాలు కొనసాగనున్నాయి. ఉదయం 8.30 గంటలకు చిన్నారులకు గుడ్లు, స్నాక్స్ ఇవ్వాలి. 11గంటలకు మధ్యాహ్న భోజనం అందజేసి ఇళ్లకు పంపాలి. 12.30 గంటలకు గర్భిణులు, బాలింతలకు భోజనం పెట్టాలి. కేంద్రాలను మాత్రం మధ్యాహ్నం 3 గంటల వరకు తెరిచి ఉంచాలి. జిల్లాలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అయితే తమకు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు కోరుతున్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- యాదాద్రి కలెక్టర్ హనుమంతు కే.జెండగే


మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, చిత్రంలో డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు

సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు.ఆదివారం ఆయన డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్‌తో కలిసి కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి, నకరేకల్, తుంగతుర్తి, ఆలేరు, జనగాం అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో మొత్తం 18,00,398 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో మహిళలు 8,94,789, పురుషులు 9,05,531, ఇతరులు 78 మంది ఉన్నట్లు వెల్లడించారు. 2,141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఓటరు ఇంటికి రెండు కిలో మీటర్ల పరిధిలో పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అవసరం మేరకు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఓటరు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా 23 ఫ్లయింగ్ స్క్వాడ్, 23 స్టాటిస్టికల్ సర్వేయల్, 9 వీడియో వీవింగ్ బృందాలు క్షేత్రస్థాయిలో పని చేస్తాయన్నారు.

నిరంతర తనిఖీలు : డీసీపీ రాజేశ్‌చంద్ర

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినందున చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేయనున్నట్లు డీసీపీ రాజేశ్‌చంద్ర తెలిపారు. అక్రమ మద్యం, నగదుతో పాటు గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే అందుకు సంబంధించి ఆధారాలు చూపాలన్నారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులను గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, బాధితులు ఆధారాలు సమర్పిస్తే విడుదల చేస్తారని చెప్పారు.